క్లుప్తంగా

సమస్యలపై స్పందించకపోతే ఆందోళనే



మాట్లాడుతున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్): వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు స్పష్టం చేశారు. నెల్లూరు హరనాథపురంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కారుణ్య నియామకాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి నియామకాలు జరిపి ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఆఫీస్ సబార్డినేట్లలో అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గత 27 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు అదే హోదాలో ఉన్నారన్నారు. వీరితో చేరిన ఇతర కేడర్ ఉద్యోగులు ఒకటికి రెండు ప్రమోషన్లు తీసుకున్నప్పటికీ ఏఎన్‌ఎంలకు ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో అదేస్థానంలో పదవీ విరమణ కావడం అన్యాయమన్నారు. ఆరోగ్యశాఖలో ఫార్మసీ అధికారులు, టెక్నీషియన్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం రెండు రోజుల క్రితం ఆ సంఘం సిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో హంస జిల్లా కార్యదర్శి కమల్‌కిరణ్, గౌరవాధ్యక్షురాలు ఇందిర, గౌరవ సలహాదారు పరిమళ, నాయకులు నారాయణ రాజు, జలీల్ అహ్మద్, శేషగిరిరావు, మజార్, రాజయ్య, నాగరాజు, ప్రసాద్, నాగరాజమ్మ, ఉష, గౌస్‌బాషా, మంజరి, ఇందుకూరుపేట, వాకాడు, విడవలూరు, కోవూరు తదితర మండలాల ప్రెసిడెంట్లు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

జీవనోపాధులు పారదర్శకంగా ఉండాలి

నెల్లూరు(బారకాసు): ఆర్పీలు, పొదుపు మహిళలు చేపట్టే జీవనోపాధులు పారదర్శకత ఉండాలని మెప్మా పీడీ లీలారాణి సూచించారు. స్థానిక ఎస్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ఆర్పీలకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మహిళలు చేపడుతున్న జీవనోపాధులపై ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. మెప్మాలో చేపడుతున్న అనేక కార్యక్రమాలు వాటి అమలుపై చర్చించి ఆర్పీలు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ప్రతి యాక్టివిటీలో మంచి ఫలితాలు సాధించే విధంగా పని చేయాలన్నారు. సంఘాల ఆడిట్ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సంఘాల డేటాను పొందుపరచడంలో ఏమైనా మార్పులు ఉంటే వెంటనే చేపట్టాలని తెలియజేశారు. 30 ఏళ్ల దాటిన మహిళలకు త్వరలో హెల్త్ చెకప్‌లు చేయించి, వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐబీ అంకయ్య, టీఈ సుధాకర్, సీఎంఎం కవిత, జరీనాతో పాటు సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సామూహిక ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 11వ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సామూహిక నిరసన ధర్నా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్ నాలుగో బిట్ సెంటర్‌లో ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు చేపట్టిన నిరసన ధర్నాకు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు హాజరై, మాట్లాడారు. ఎన్టీఆర్ నగర్, రాయపుపాళెం, కొండారెడ్డి దిబ్బ, పల్లెపాళెం ప్రాంతాల్లో గత 50 ఏళ్ల నుంచి నివసిస్తున్న పేద ప్రజల ఇళ్ల, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఇళ్లు లేని పేదలకు 12 అంకణాల స్థలాన్ని నేటి కూటమి ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఎన్టీఆర్ నగర్‌లో ప్రభుత్వ హైస్కూల్, రేషన్ దుకాణం, సచివాలయాలను ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లేందుకు అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్యసేవలు మృగ్యం

- జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- సక్రమంగా అందని వైద్యసేవలు



వెంకటాచలంలోని సీహెచ్‌సీ

వెంకటాచలం: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి.. వైద్యుల పనితీరు సక్రమంగా లేకపోవడం.. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు సరైన వైద్యసేవలందడంలేదు. వాతావరణంలో మార్పులతో ప్రతి ఇంట్లో జర్వాలతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. సర్కారీ హాస్పిటళ్లలో వైద్యసేవలు అంతంతమాత్రంగా అందుతుండటంతో ప్రైవేట్ ఆస్పత్రులను రోగులు ఆశ్రయించాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

వెంకటాచలం మండలంలో 25 గ్రామ పంచాయతీలుండగా, 60 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. మండలంలో ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలందించేందుకు గానూ వెంకటాచలంలో సీహెచ్‌సీ.. కసుమూరు, ఇస్కపాళెంలో పీహెచ్‌సీలున్నాయి. నెల రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోని సైడ్ కాలువల్లో నెలల తరబడి మురుగు నిల్వ ఉండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని కాకుటూరు, చవటపాళెం, అనికేపల్లి, గొలగమూడి తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరాలకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జ్వరాలు, జలుబు, దగ్గు తదితర రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి.

అంతులేని నిర్లక్ష్యం

జ్వరాల తీవ్రత ప్రతి గ్రామంలో ఉంది. ప్రజలకు ప్రస్తుతం ఎలాంటి పనుల్లేకపోవడంతో పూట గడవడమే కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో జ్వరాల బారినపడి వెంకటాచలంలోని సీహెచ్‌సీకి వెళ్తే అక్కడ సేవలు సక్రమంగా అందడంలేదని రోగులు వాపోతున్నారు. వైద్యులు, సిబ్బంది కోసం గంటలు తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొందరు సిబ్బంది, వైద్యాధికారి మధ్య ఉన్న గొడవలతో వైద్యసేవలు సక్రమంగా అందడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు వైద్య సిబ్బంది గంటకు పైగా విధులను బహిష్కరించడంతో రోగులు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సమగ్ర విచారణ జరపకుండానే, సీహెచ్‌సీలో ఎలాంటి సమస్యల్లేవని ఉన్నతాధికారులు తేలచ్చడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

ఇస్కపాళెంలోనూ అంతే..

ఇస్కపాళెం పీహెచ్‌సీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన వైద్యసేవలు అందించకుండానే వెనక్కి పంపుతున్నారని చెప్తున్నారు. కొందరు వైద్య సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని కోరుతున్నారు.



జ్వరాలతో వచ్చిన రోగులు



వైద్యుల కోసం ఎదురుచూపులు

ప్రసన్న పరామర్శ



సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పొన్నవోలు సుధీర్‌కుమార్‌రెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డితో కలిసి సుధీర్‌కుమార్ రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నాయకులు ఎరటపల్లి మీరారెడ్డి, నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ కల్యాణి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సోనగిరి జగన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, నాయకులు హరి, మొలకమ్మ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘ నాయకులతో ముచ్చటిస్తూ..

రైతులను ఆదుకోవాలి

కాగా ఇనమడుగుకు ప్రసన్న రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతు సంఘ నాయకులు వచ్చి సమావేశమయ్యారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గొలగమూడిలో పూజలు



మనుబోలు: పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

వెంకటాచలం: గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని భక్తులు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆశ్రమ నిత్యాన్నదానశాలలో అన్నసంతర్పణ చేశారు.

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. పంచామృతాభిషేకం తదితర పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. ఆలయం వద్ద అన్నదానాన్ని మధ్యాహ్నం నిర్వహించారు. ఉభయకర్తలుగా కోటేశ్వరగౌడ్, సునీతమ్మ దంపతులు వ్యవహరించారు.

ప్రథమ చికిత్స ఆవశ్యకతపై ర్యాలీ



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల విద్యార్థులు ప్రథమ చికిత్స ఆవశ్యకతపై గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాలల నుంచి నార్తురాజుపాళెం కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు 'ప్రథమ చికిత్స నేర్చుకోండి-హీరోగా మారండి', 'ప్రథమ చికిత్స అంటే జీవితానికి మరో అవకాశం ఇవ్వడం' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స చేయడం అత్యంత ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసకుమార్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్ సతీష్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పి.రవికుమార్, ఏఓ కె.గిరీష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ఏపీఓ ఫణికుమార్, పీడీ బాలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హెచ్‌డీఎస్ కమిటీ తనిఖీ



జీజీహెచ్ సెల్లార్‌ను తనిఖీ చేస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం హాస్పిటల్‌లోని పలు విభాగాలను తనిఖీ చేశారు. సెల్లార్‌తో పాటు మోటార్లు సక్రమంగా పని చేస్తున్నాయా.. విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురయ్యాయా.. లైట్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో సెల్లార్‌లో నీరు చేరిపోతోందన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్యానెల్ బోర్డులు మునిగిపోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని హాస్పిటల్ అధికారులకు సూచించారు. ఒక మోటారు మరమ్మతులకు గురయిందని దానిని వెంటనే సరిచేయించాలని సూచించారు. నీరు పోయే కాలువల పూడికను తొలగించాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆస్పత్రి ఏడీ ఏడుకొండలు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మోటారును తక్షణమే మరమ్మతులు చేసి వర్కింగ్ కండిషన్‌లోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ సూపర్‌వైజర్ విజయకుమార్, ప్రభుత్వ సూపర్‌వైజర్ పృథ్వీరాజ్, సెక్యూరిటీ సీఎస్‌ఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో వెంకటేశ్వరుడు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురంలో హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలను పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరీక్షల నిమిత్తం హాస్టల్లోని తాగునీటి శాంపిళ్లను సేకరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీఓ నేతలు

నెల్లూరు (అర్బన్): నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లాను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ నేతలు శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువా కప్పి సన్మానించారు. సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో ఎన్జీఓ పక్షాన కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షులు కరుణమ్మ, చిన్నమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, కృష్ణకుమార్, కృష్ణంరాజు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో లోక్ అదాలత్



లోక్ అదాలత్ ఏజేఎంఎఫ్‌సీ కోర్టు ఇన్‌చార్జి జడ్జి పి.భరద్వాజ్, కోవూరు స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కృష్ణయ్య, సభ్యులు వి.రాంబాబు, పి.వీరేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు: కోవూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.చైతన్య మాట్లాడుతూ బ్యాంక్ కేసులు 31, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి బిల్లుల కేసులు 18, సివిల్, క్రిమినల్ కేసులు 90 పరిష్కారమయ్యాయన్నారు. సెటిల్‌మెంట్ అమౌంట్ రూ.10.36 లక్షలు రికవరీ జరిగిందన్నారు. కోర్టుల్లో కేసులు సంవత్సరాల తరబడి వాయిదాలపై నడుస్తుంటాయని, కానీ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కేసు పరిష్కారమైతే ఇరువురికీ మేలు జరుగుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న వివాదాలు, కుటుంబ సమస్యలు, బ్యాంక్ రుణాలు వంటి వాటిపై ఇక్కడ రాజీ పడితే ఇరుపక్షాలకు లాభం కలుగుతుందని వివరించారు. నెల్లూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కోవూరు

ఆర్టీసీలో దుకాణ సముదాయాలు

- వ్యాపారులను ఆహ్వానిస్తున్న అధికారులు
- ఆదాయానికి తోడ్పడాలని విజ్ఞప్తి



ఆర్టీసీ బస్‌స్టేషన్



ప్రాంగణంలో నిర్మిస్తున్న దుకాణాలు

పొదలకూరు: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించేందుకు అధికారులు యత్నిస్తున్నారు. వాస్తవానికి పట్టణంలోని నెల్లూరు మార్గంలో విలువైన స్థలంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆలనాపాలనా లేక బోసిపోయే ఉండేది. ఇటీవల అధికారులు చొరవ చూపి దీని అభివృద్ధికి నడుం బిగించారు.

నాడిలా..

పొదలకూరులో ఆర్టీసీ బస్టాండ్‌ను 1996లో ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం బస్టాండ్‌లో ఒకట్రెండు దుకాణాలను నిర్వహించినా, ఆపై వదిలేశారు. అప్పట్లో ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడం.. బస్టాండ్‌కు పంచాయతీ దూరంగా ఉండటంతో ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో అసాంఘిక శక్తులకు స్థావరంగానూ మారింది. బస్సులు సైతం బస్టాండ్‌లో ఆపకపోవడంతో విలువైన స్థలం వృథా అవుతుండటంతో అధికారులు చొరవ చూపి అభివృద్ధి చేస్తున్నారు.

దుకాణ సముదాయ నిర్మాణం

ప్రస్తుతం దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తున్నారు. తాత్కాలికంగా దుకాణాలను నిర్మించడంతో పాటు, వ్యాపారాలు చేసుకునే వారు సైతం నిర్మించుకునేందుకు అనుమతులిస్తున్నారు. దీంతో దుకాణాలను వేగంగా నిర్మిస్తున్నారు. దీంతో నెల్లూరు మార్గంలో వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్నాయి. నిర్మాణాలను ఆర్టీసీ నెల్లూరు ఆర్ఎం సైతం ఇటీవల పరిశీలించారు.

ఆదాయం పెరిగే అవకాశం

దుకాణాల నిర్మాణాలు పూర్తయి వ్యాపారాలు సజావుగా సాగితే మరికొందరు ఇక్కడ సాగించే అవకాశం ఉంది. దీంతో పంచాయతీ బస్టాండ్‌లో అద్దెలు చెల్లించి వ్యాపారాలు చేసుకుంటున్న వారు సైతం ఇక్కడికి వచ్చే అవకాశమూ ఉంది. ఫలితంగా ఆర్టీసీ ఆదాయం పెరగనుంది.

సురవరం సంస్మరణ సభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఆదివారం నగరంలో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అధికార, ప్రతిపక్ష నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కార్మిక, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు పాల్గొననున్నారన్నారు.

వర్షపు నీటిలోనే పంట పొలాలు



జొన్నవాడలో వరిపైరులో నిలిచిన వర్షపునీరు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులకు మండలంలో పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పొలాల్లో నీరు నిలిచాయి. ముఖ్యంగా దామరమడుగు, రేబాల, మినగల్లు, పంచేడు, జొన్నవాడ, మునులపూడి ప్రాంతాల్లో వరికోత దశలో ఉంది. కొందరు రైతులు వరికోతలు పూర్తి చేశారు. రోడ్లపై, పొలాల్లో ధాన్యం ఆరబోసి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరికొంతమంది రైతులు పొలాల్లో నీరు చేరడం, వరి నేలవాలడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారీతిన రైతుల పంటను దోచుకుంటున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చు కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో దాదాపు వందల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. అయినప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్‌లైనా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణమెప్పటికో..?

పొదలకూరు: మండలంలోని కనుపర్తి రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. సోమశిల – పొదలకూరు మెయిన్‌రోడ్డు నుంచి కనుపర్తిలోని రోడ్డు నిర్మాణానికి నిధులను గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. అయితే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్, పనులను కాంట్రాక్టర్ త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కంకర లేచిన రోడ్డుపై వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.



అలా వదిలేశారు

- 31 ఏళ్లుగా అసంపూర్తిగానే భవనం



సగం నిర్మించి వదిలేసిన భవనం

కొడవలూరు: ఆ ప్రభుత్వ భవనాన్ని 31 ఏళ్ల క్రితం సగం నిర్మించి వదిలేశారు. దీనిని పూర్తి చేస్తే కార్యాలయం లేని ప్రభుత్వ శాఖలు వినియోగించుకొనే వెసులుబాటు ఉంటుంది. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడం గమనార్హం. కొడవలూరు పీహెచ్‌సీ పక్కనున్న ప్రభుత్వ స్థలంలో 1994లో వ్యవసాయ శాఖకు కార్యాలయ నిర్మాణం చేపట్టారు. సగం నిర్మించాక బిల్లులు చెల్లించలేదన్న కారణంతో కాంట్రాక్టర్ పనులను ఉపసంహరించుకున్నారు. తరువాత 2018లో ఎంపీడీఓ కార్యాలయం పక్కనే వ్యవసాయశాఖ కార్యాలయానికి భవనం నిర్మించారు. తొలుత వ్యవసాయశాఖ కార్యాలయం కోసం సగం నిర్మించిన భవనం అలాగే ఉండిపోయింది. అప్పట్నుంచీ దీనిని పట్టించుకున్నవారు లేకుండాపోయారు. ఇక్కడ పలు ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు లేక ఎంపీడీఓ కార్యాలయంలోనే ఓ గదిని వినియోగిస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు కార్యాలయ సదుపాయం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలోనే ఓ గదిలో కార్యాలయ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒకే గది కావడం తీవ్ర అసౌకర్యంగా ఉన్నా తప్పడం లేదు. పీహెచ్‌సీ పక్కన అర్ధాంతరంగా వదిలేసిన భవనం పిల్లర్లతో నిర్మించి ఉన్నందున కొంత నిధులు కేటాయించి భవన పనులు పూర్తి చేస్తే కార్యాలయం లేని శాఖలు వినియోగించుకొనే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఆ అసంపూర్తి భవనంలో ప్రైవేటు వ్యక్తులు గడ్డి వేసుకునేందుకు వినియోగిస్తున్నారు. తక్కువ నిధుల ఖర్చుతోనే ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చే వెసులుబాటు ఉన్నందున వినియోగంలోకి తెస్తే కార్యాలయం లేని ప్రభుత్వ శాఖలకు ఊరటగా ఉంటుంది.